RNI No. : TELTEL/2019/79009

కొమురం భీమ్ విలేకరులు కావలెను
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజక వర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత
యువ జర్నలిస్టులకు అవకాశం
రిపోర్టర్‌కు ఇ.ఎస్.ఐ. భద్రత ఉంటుంది
కొమురం భీమ్ Komuram Bheem తెలుగు డైలీ
సంప్రదించగలరు : 85220 24855

తెలుగు దినపత్రిక

# కొమురం భీమ్

ప్రజా సమస్యలపై అక్షర పోరాటం

ఎడిటర్ : ముల్కల్ల ప్రసాద్

సంపుటి : 7 | సంచిక : 136 | 21 జూన్ 2026 | SIMULTANEOUSLY PUBLISHED PEDDAPALLI AND HYDERABAD | ఆదివారం | పేజీలు : 8 | వెల : 4



ఒడిషాలో 47వేల కోట్లతో

## అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన

భువనేశ్వర్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :
ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు >> మిగతా..2లో


6

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

- ఎలాంటి ఒత్తిడికి గురికావదదంన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు


2

## హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

- లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం
- హైడ్రా పై దుష్ప్రచారం తగదు
- మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

- ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక
- పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం
- వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి
- వ్యాధి చికిత్స కంటే నివారణెళి మిన్న
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :
ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య



ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణెళి అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, దయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):
రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులను



ఆదుకోవడంతో పాటు విజయా డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశుసంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన >> మిగతా..2లో

## కవిత బొగ్గుబాయి బాటలో ఉద్రిక్తత

### భూపాల్‌పల్లిలో అడ్డుకున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):
టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత చేపట్టిన బొగ్గుబాయి బాట ఉద్రిక్తతలకు దారితీసింది. సింగరేణి కేటీకే-5 ఇంక్లైన్ గని వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేటీకే-5 ఇంక్లైన్ గనికి చేరుకున్నారు. అయితే గని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కవితను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, టీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. కవితకు మద్దతుగా వచ్చిన నాయకులు మెయిన్ గేట్ ఎక్కేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్తత మరింత పెరిగింది. నిరసన మధ్య గేట్‌ను తొలగించడంతో కల్వకుంట్ల కవిత అనుచరులతో కలిసి గని ప్రాంగణంలోకి ప్రవేశించారు. ఈ ఘటనతో గని పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

- 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సిఎం
- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):
హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు.



మెట్రో ఫేజ్-2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

తెలంగాణ స్వాప్నికులు

## ప్రొఫెసర్ జయశంకర్

- తెలంగాణ సాధనే శ్వాసగా జీవించిన సార్
- వర్ధంతి సందర్భంగా త్యాగం, కృషిని గుర్తు చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):
తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, కృషిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



స్మరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా ఆయన జీవితాన్ని గడిపారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుడి త్యాగాన్ని తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచుకుంటుందని >> మిగతా..2లో

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే

- ప్రస్తుత విధానంతో పంచాయితీల బలహీనం
- కేంద్రానికి లేఖ ర ఆశామన్న మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):
వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్కపేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ఈజీఎన్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే




నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు. 60 రోజుల తప్పనిసరి ఉపాధి విరామం గ్రామీణ పేదల ఆదాయాన్ని దెబ్బతీస్తుందని >> మిగతా..2లో

కొమురం భీమ్
Komurambheem Telugu Daily
విశ్లేషణాత్మకం

## ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాత)

పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

(మొదటి పేజీ తరువాత)

మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

## తెలంగాణ స్వాప్నికులు ప్రొఫెసర్ జయశంకర్

(మొదటి పేజీ తరువాత)

తెలిపారు. ఆ మహనీయుడి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కోసం ప్రజా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ వ్యతిరేకించారని తెలిపారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు.

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని సవరించాల్సిందే

(మొదటి పేజీ తరువాత)

అన్నారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాలకు 60 రోజుల నిషేధం నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ పనులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మొక్కల పెంపకం, అటవీకరణ కార్యక్రమాలకు ఉపాధి విరామం వర్తింపజేయొద్దని అన్నారు. దళితులు, గిరిజనులు, భూమిలేని కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చట్టంలో మార్పులు చేయాలని మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు. గృహ నిర్మాణ లబ్దిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.

# అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

- రైతులకు నరకం చూపిస్తున్న రేవంత్ ప్రభుత్వం
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు



**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు. సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

- ఎఫ్ఏటీఎఫ్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐఏఎస్



**న్యూఢిల్లీ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తాజాగా కీలక బాధ్యతలు లభించాయి. టెర్రరిస్టుల ఆర్థికమూలాలు, అక్రమ నగదు రవాణా నెట్వర్క్‌లను దెబ్బతీసేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా అంతర్జాతీయంగా చేపడుతున్న చర్యల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ఇది ఒక భారీ విజయమని వ్యాఖ్యానించారు. ఎఫ్ఏటీఎఫ్‌లో ఒక భారత అధికారికి ఇంతటి కీలక బాధ్యతలు దక్కడం ఇదే తొలిసారి. ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఉన్నారు. అంతకుముందే, కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో చీఫ్ సెక్రటరీ గ్రేడ్ అధికారిగా 2025లో పదోన్నతి సాధించారు. గతంలో ఆయన రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీగా ఉన్నారు.ఁ÷నాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ డైరెక్టర్‌గా కూడా సేవలందించారు. పరిపాలన, ఆర్థిక అంశాల నిర్వహణలో విశేష గుర్తింపు పొందారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి బీకామ్, ఎల్ఎల్‌బీ చేసిన ఆయన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా నుంచి సీఎస్(ఇంటర్) కూడా చేశారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించి ప్రత్యేక కోర్సు కూడా చేశారు.

# హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి

- లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం
- హైడ్రా పై దుష్ప్రచారం తగదు
- మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళుతుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

విలేకరులు కావలెను
సెల్ : 8522024855

## బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

### వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.



## బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

- బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన

**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ గారు, కంచర్ల వందన గౌడ్ గారు, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

## స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** శనివారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 220 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 200 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 170 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,080 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,33,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,09, 560 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# కొమురం భీమ్

21 జూన్ 2026 (ఆదివారం)

## సంపాదకీయం

# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా...!

మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరనవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయంలోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున - స్థిరసుఖ మాసనమ్- అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో - సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ - ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము - ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ - ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.-ధవుతి, నేతి, వస్తి, నొలి, త్రటకం, తధా కపాల భాతి ఏతాని షట్ కర్మాణి - అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయడానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

# సర్ ప్రక్రియతలో అప్రమత్తం కావాలి

- ఓట్లు తొలగిపోకుండా జాగ్రత్త పడాలి
- కార్యకర్తలకు మంత్రి తుమ్మల హితవు



**ఖమ్మం, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** సర్‌పై అప్రమత్తంగా లేకపోతే అనేక రకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సర్‌లో ఓట్ల తొలగింపు సమయంలో సక్రమంగా గుర్తించాలని అన్నారు. శనివారం ముఖ్య కార్యకర్తలతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నియోజకవర్గంలో 3,02,800 ఓట్లు ఉంటే అందులో సగం ఓట్లు కూడా మ్యాపింగ్ కాలేదన్నారు. లక్షన్నరకు పైగా ఓట్లు పోయే పరిస్థితి కనపడుతోందన్నారు. ఇప్పటికైనా అప్రమత్తం కావాలని.. ప్రతి ఒక్క ఓటుని కాపాడుకోవాలన్నారు. ఓట్లను కాపాడుకోలేకపోతే భవిష్యత్తు రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు శాతం ఓట్ల తేడాతోనే గెలవడం జరిగిందని మంత్రి తెలిపారు. సర్ కార్యక్రమంలో 55 శాతానికి పైగా ఓట్లు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. అప్రమత్తంగా లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నారు. మమతా బెనర్జీ, స్టాలిన్ ఓడిపోవడానికి కారణాలు, పరిస్థితిలు గుర్తు చేసుకోవాలని నాయకులకు సూచించారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారికి జీవన్మరణ సమస్య తప్పదన్నారు. బీజేపీ కావాలని ఓట్లను తొలగిస్తోందని, మరో పార్టీ మరోలా చేస్తోందని రకరకాల ప్రచారాలు వస్తున్నాయన్నారు. ఈ క్లిష్ట పరిస్థితులలో అప్రమత్తంగా లేకపోతే నష్టపోతామని తెలిపారు. అధికారులకు సహకరించాలని, వారితో కలిసి సమన్వయం చేసుకొని ఓట్లను కాపాడుకోవాలని నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్
- ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ
- బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు
- చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్



**అమరావతి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా పక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడవే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జన్మదినోత్సవం

- ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు



**అమరావతి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. దేశానికి ద్రౌపది ముర్మ అందిస్తున్న సేవల్లో విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించగా, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్మ నిజమైన స్ఫూర్తిదాయకమని పవన్ అన్నారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు. ఆమె జీవితం, ప్రజాసేవ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ద్రౌపది ముర్మ మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ.. ఆమె సాగించిన అద్భుత ప్రయాణం, ప్రజాసేవకులు, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ నిజమైన స్ఫూర్తిదాయకం. ఇది అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య బలానికి, అంకితభావంతో కూడిన ప్రజాసేవ శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. దేశ సేవలో ఆమెకు మంచి ఆరోగ్యం, దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

- మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్
- ఖంగుతిన ఎటిఎకు సమాచారం ఇచ్చిన విద్యార్థి
- పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్‌కు హామీ

**న్యూఢిల్లీ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పుర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

# చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

**హన్మకొండ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఢిల్లీలో మరోమారు ఆందోళనకు దిగిన కాక్రోచ్ పార్టీ

**న్యూఢిల్లీ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):** ఢిల్లీలో హైటెన్షన్ నెలకొంది. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)' ఆందోళనల్లో ఉద్రిక్తత నెలకొంది. నీట్ పేపర్ లీక్, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్లతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అయితే, తమ నిరసన టైమ్ పొడగించాలని సీజేపీ డిమాండ్‌ను పోలీసులు తిరస్కరించారు. దీంతో నిరసనకారుల్ని పోలీసులు ఆ ప్రదేశం నుంచి శాంతియుతంగా తొలగించడంతో ఉద్రిక్తత మొదలైంది. సాయంత్రం 6 గంటలకు కూడా మద్దతుదారులు పెద్ద సంఖ్యలో చేరాలని సీజేపీ పిలుపునిచ్చింది. అయితే, ఢిల్లీ పోలీసులు మాత్రం గడవు ముగిసిందని, నిరసనకారులు ప్రదేశాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు. జంతర్ మంతర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఎస్ఎఫ్ఐకి చెందిన పలువురు విద్యార్థి నాయకులు ఇంకా వేదికపైనే ఉన్నారు. దీనికి ముందు జనాలను ఉద్దేశిస్తూ ప్రసంగించిన దీప్కే.. శాంతియుత నిరసనకు అనుమతి పొడగించాలని ఢిల్లీ పోలీసుల్ని కోరారు. చర్చలకు మేం సిద్ధం, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలనేది మా డిమాండ్. బలవంతంగా మమ్మల్ని తొలగించడానికి పోలీసులు అరెస్ట్‌లు చేస్తే, అరెస్ట్ అయ్యే వారిలో నేనే మొదటి వ్యక్తిని అవుతానునని దీప్కే అన్నారు.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily
జిల్లాల వార్తలు

## నిరంజన్ కుటుంబానికి
# బండ్ల గణెలిశ్ అండ

### 5లక్షల సాయంగా చెక్కు అందచేత

**హన్మకొండ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**
ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న హనుమకొండ బాలుడు నిరంజన్ కుటుంబానికి ప్రముఖ చిత్ర నిర్మాత బండ్ల గణెలిష్ 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించిన సంగతి తెలిసిందే. శనివారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి బండ్ల గణెలిష్ వెళ్లారు. నిరంజన్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ తరఫున ఐదు లక్షల రూపాయల చెక్‌ను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పవన్ కల్యాణ్ భక్తుడిగా.. ఆయన స్ఫూర్తితో నిరంజన్‌కు ఆర్థిక సాయం చేశాను. దైవసమానులైన పవన్ కల్యాణ్ పరామర్శతో నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. మేమందరం ఇలా ఉన్నామంటే పవన్ కల్యాణ్ దయతోనే. నా కూతురి పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నా. ఈ రోజు వచ్చి ఆర్థిక సాయం చేయాలనుకున్నాను. నారా భువనేశ్వరి పుట్టిన రోజున ఐదు లక్షల రూపాయలు ఇవ్వడం సంతోషంగా ఉంది. నిరంజన్ బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇప్పుడు రాజకీయాల గురించి మాట్లాడను' అని అన్నారు.

---

# మోనాలిసా దంపతులకు రక్షణ

### పోలీసులను ఆదేశించిన కేరళ హైకోర్టు

**తిరువనంతపురం, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**



'కుంభమేళా గర్ల్' మోనాలిసాకు భద్రత కల్పించటంపై కేరళ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. మోనాలిసా, ఆమె భర్త మొహమ్మద్ ఫర్మాన్‌కు భద్రత కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. మోనాలిసా, మొహమ్మద్ ఫర్మాన్‌కు ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి.. మార్చి 11వ తేదీన తిరువనంతపురంలోని అరుమనూర్ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత మోనాలిసా వయసుపై తీవ్ర స్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. ఫర్మాన్ తన కూతురిని కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్నాడని మోనాలిసా తండ్రి మధ్యప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్'కు ఫిర్యాదు కూడా వెళ్లింది. 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' మోనాలిసా వయసుపై దర్యాప్తు చేయగా.. ఆమె మైనర్ అని తేలింది. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ దర్యాప్తులో బయటపడ్డ విషయాల మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద మోనాలిసా భర్తపై కేసులు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా.. అతడు కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. కేరళ హైకోర్టు ఫర్మాన్ ఖాన్‌ను అరెస్ట్ చేయకుండా స్టే విధించింది. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ కేరళలోనే ఉంటున్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందంటూ కొద్దిరోజుల క్రితం మోనాలిసా కేరళ హైకోర్టులో పిటిషన్ వేశారు. మతాంతర వివాహం కారణంగా మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తుల నుంచి తమకు ప్రాణ హాని ఉందని మోనాలిసా తన పిటిషన్‌లో పేర్కొంది. తమకు భద్రత కల్పించేలా ప్రభుత్వానికి, ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. శనివారం మోనాలిసా పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. మోనాలిసా తరఫు న్యాయవాదితో పాటు ప్రభుత్వ ప్లీడర్ వాదనలను విన్న కోర్టు.. పిటిషనర్ ప్రాణానికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని భావించింది. రిట్ పిటిషన్ విచారణ పూర్తయ్యే వరకు మోనాలిసా, ఆమె భర్తకు రక్షణ కల్పించాలని ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను ఆదేశించింది. తదుపరి విచారణను జులై 10వ తేదీకి వాయిదా వేసింది.

---

# ఖాళీ ఖజానా అప్పగించిన జగన్

### చంద్రబాబు దక్షతతో గాడిలో పడుతున్న రాష్ట్రం
### రైతులు సేంద్రియ పంటలవైపు మొగ్గాలి: అచ్చన్నాయుడు

**పల్నాడు, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**
కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చేసరికి ఖజానా ఖాళీగా ఉందని, భయంభయంగానే పాలన మొదలుపెట్టామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అయినా ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. చంద్రబాబు నాయుడు దక్షతతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ఇన అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పల్నాడు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వైకాపా పాలనలో వ్యవసాయ, నీటిపారుదల శాఖలకు తాళాలు వేశారని ఆరోపించారు. రాష్ట్ర రైతులకు మేలు చేసేలా అనేక కార్యక్రమాలు చేపట్టాం. రెండేళ్లుగా భూసార పరీక్షలు చేస్తున్నాం. డ్రిప్ పరికరాలు ఇస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలి. సేద్యంలో ఆధునిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు పాటించాలి. సేంద్రియ సాగు ఉత్పత్తులనే అనేక దేశాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలని సూచించారు. పంటలను అంతర్జాతీయ మార్కెట్లో అమ్మాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలన్నారు.

---

# కట్ల పాములతో చెలగాటం

■ ప్రాణం కోల్పోయిన యువకుడు

**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):**
పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను




భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాట్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా ఆరోగ్యం కూడా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన స్నేహితులు నవాబ్‌ను వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో నవాబ్ కన్నుమూశాడు. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

---

# ఖతార్ పాలకుల ఔదార్యం

■ ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్
■ ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు

**వాషింగ్టన్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**
ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు,




గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది. జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

---

# ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం

■ రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది
■ 48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం
■ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలి
■ ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది
■ వైకాపా హయాంలో రైతులు నానా కష్టాలు పడ్డారు
■ లింగగుట్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల
■ రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు

**పల్నాడు, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**
రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. అక్కడే రైతులు సెలఅ÷-÷-ఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని



విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాల్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం-కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

---

సబ్ ఎడిటర్స్ కావలెను
సెల్ : 8522024855

---

# ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి చిరుత

■ కుక్కను చంపి తీసుకెళ్లినట్లు సిసి కెమెరాల్లో రికార్డు

**ముంబై, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**
ఐఐటీ బాంబే క్యాంపస్‌లోకి ఓ చిరుత ప్రవేశించింది. స్టాఫ్ హాస్టల్ ఏరియాలో ఓ కుక్కను చంపేసింది. పోవాయ్‌లో ఉన్న వర్సిటీ సీసీ కెమెరాలకు ఆ ఘటన చిక్కింది. ఈ ఘటన 19వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు జరిగింది. క్యాంపస్‌లోకి చిరుత ప్రవేశించడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్యాంపస్‌లోని రెసిడెన్షియల్ ఏరియాలో చిరుత సంచరిస్తున్నట్లు ఇప్పటికే ఫిర్యాదు ఉన్నది. హాస్టల్ మెట్ల వద్ద ఉన్న ఓ కుక్కను చిరుత తన నోటితో పట్టి చంపేసింది. చాలా నెమ్మదిగా వాకింగ్ చేసుకుంటూ వచ్చిన ఆ చిరుత సడెన్‌గా కుక్కపై దాడి చేసింది. చనిపోయిన కుక్క బాడీతోనే ఆ చిరుత అదృశ్యమైంది. క్యాంపస్ విద్యార్థులు, సిబ్బంది, స్థానికులు ఆ వీడియో చూసి భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి పూట సంచారం ఇబ్బందిగా మారినట్లు ఫిర్యాదు చేశారు. పోవాయ్ సమీపంలో అటవీ ప్రదేశం ఉన్న కారణంగా.. అక్కడ పలు సందర్భాల్లో చిరుతలు కనిపించాయి.

---

# సాయికృష్ణ అదృశ్యం కేసులో దర్యాప్తు ముమ్మరం

■ స్వర్గపురి శ్మశాన వాటికలో డెడ్‌బాడీల దహనంపై ఆరా

**విజయవాడ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):**
విజయవాడలో సాయికృష్ణ అదృశ్యం కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సాయికృష్ణ డెడ్‌బాడీని స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేశారని ఆరోపణలు వస్తుండటంతో అక్కడ ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. మే 24, 25 తేదీల్లో స్వర్గపురి శ్మశానంలో జరిగిన గుర్తుతెలియని మృతదేహాల దహనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మే 23వ తేదీ రాత్రి 8 గంటలకు రెండు గుర్తుతెలియని మృతదేహాలను స్వర్గపురికి తీసుకువచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత స్వర్గపురిలోకి మృతదేహాలకు ప్రవేశం ఉండదు. దీంతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో చెప్పటంతో రెండు మృతదేహాలను సిబ్బంది స్వర్గపురి మార్చురీలో ఉంచారు. రెండు మృతదేహాలను మే 24న ఖననం చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ రెండు మృతదేహాలు 40 ఏళ్లు పైబడిన వారివిగా రికార్డుల్లో నమోదు అయ్యింది. 23 ఏళ్ల యువకుడిని దహనం చేసినట్లుగా ఎలాంటి రికార్డు నమోదు కాలేదు. స్వర్గపురిలో ఎలక్ట్రిక్ దహనాలు చేసే బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం బాషాను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాషా ఫోన్‌ను సీఐ పవన్ కిషోర్ స్వాధీనం చేసుకున్నారు.

---

## నరహరి లాకర్లలో
# భారీగా డబ్బులు

### కోటిన్నర నగదు స్వాధీనం
### రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు

**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):**
ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి లాకర్లలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. దాదాపు కోటిన్నర నగదుతో పాటు, రెండున్నర కిలోల బంగారు అభరణాలను లాకర్లలో అధికారులు గుర్తించారు. నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు నిరాకరించడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ పక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ.1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. లాకర్లలో దొరికిన నగదు, బంగారానికి సంబంధించిన పత్రాలను కూడా ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు రికార్డులు, పన్ను వివరాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. భారీ మొత్తంలో నగదు, బంగారం బయటపడటంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఏసీబీ అధికారులు సేకరించిన ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

# యూరియా సరఫరాలో తెలంగాణ దేశానికే ఆదర్శం

- యూరియా బుకింగ్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలి
- బోనస్ పొందాలంటే ప్రభుత్వం గుర్తించిన ఏడు వరి రకాలనే సాగు చేయాలి
- జిల్లాలో యూరియా కొరతకు తావులేదు
- యూరియా బుకింగ్ యాప్‌పై డీలర్లు, వ్యవసాయ అధికారులు, రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్
- ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు



**పెద్దపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** యూరియా సరఫరాలో యాప్ ఆధారిత విధానాన్ని అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి తో కలిసి యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ, రైతులు యూరియా కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో పెద్దపల్లి జిల్లాలో యూరియా బుకింగ్ యాప్‌ను రబీ పంట కాలంలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించగా వారు పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. గత రబీ సీజన్‌లో జిల్లాలో 4 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌ను పొందాలంటే రైతులు బీపీటీ, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్, తెలంగాణ సోనా, వరంగల్-44, 1638, 7715 అనే ఏడు సన్నా వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సిద్ధంగా ఉంచామని, రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులు, డీలర్లను ఆదేశించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. జూన్ 30 నుంచి రైతు భరోసా ఖరీఫ్ నిధులు విడుదల కానున్నాయని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విశేష పురోగతి సాధించామని, గత రెండున్నర సంవత్సరాల్లో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేసి రాష్ట్రస్థాయి గుర్తింపు పొందినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,లి గత ఖరీఫ్ సీజన్‌లో అధికారులు, డీలర్లు, రైతుల సహకారంతో జిల్లాలో యూరియా సమస్య తలెత్తలేదని, అందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత సంవత్సరం జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరిగిందని, ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో 26 వేల మెట్రిక్ టన్నుల అవసరం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉండగా, వారం రోజుల్లో మరో 4 వేల మెట్రిక్ టన్నులు రైల్వే ద్వారా చేరనున్నాయని, అదనంగా ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి మరో 2 వేల మెట్రిక్ టన్నుల సరఫరా అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో యూరియా కొరతకు అవకాశం లేదని, అంతర్గత సరఫరా వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ-పాస్ యంత్రాల ద్వారానే యూరియా విక్రయాలు జరగాలని, మండలాల వారీగా అవసరమైన నిల్వలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా యూరియా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించామని, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతిరోజూ బుకింగ్‌లను పర్యవేక్షించాలని తెలిపారు. రైతులకు అవసరానికి మించి యూరియా అందకుండా, ఎవరూ ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. యాప్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తిన వెంటనే 8 నుంచి 10 గంటల్లో పరిష్కరించాలని, జిల్లాలో ఆందోళనతో అధిక కొనుగోళ్లు జరగకుండా అధికారులు, డీలర్లు రైతులతో సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. గత సీజన్‌లో అక్రమాలకు పాల్పడిన కొన్ని దుకాణాలపై చర్యలు తీసుకున్నామని, ఈసారి ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా కేవలం యాప్, ఈ-పాస్ విధానంలోనే యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ఎరువుల డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ సర్కార్

- ఎన్నికల్లో ఇచ్చిన సియం రేవంత్ హామీలు ఏమాఏ
- రైతులు న్యాయం జరిగేదాక బిఆర్ఎస్ పోరాడుతుంది
- రామగుండంమాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు పంటల కొనుగోళ్ల బాధ్యత నుంచి తప్పించుకుంటూ రైతుల నెత్తిన పిడుగు వేసిందని రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిరాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసే చర్య అని విమర్శించారు. ధాన్యం, మక్కజొన్న, జొన్నలు, కందులు, పెసర్లు సహా ఏ పంటనైనా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకే కొనుగోలు చేస్తామని రాష్ట్ర మంత్రులు ప్రకటించడం ద్వారా రైతుల పట్ల తమ బాధ్యత నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా తప్పించుకున్నట్లు స్పష్టమైందన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు పంటల కొనుగోళ్ల విషయంలో చేతులెత్తేయడం దారుణమని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతులను నమ్మించి ఓట్లు పొందిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించారని చందర్ విమర్శించారు. కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి పండిన పంటలను ఎవరు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యం, మక్కలు, ఇతర పంటలు కొనుగోలు కాకపోతే వారు తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల కొనుగోళ్ల బాధ్యతను పూర్తిగా కేంద్ర ప్రభుత్వంపై నెట్టివేయడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారుల దోపిడీకి రైతులు గురికాకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చివరి గింజ వరకు కొంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మాట మార్చింది? కేంద్రం టార్గెట్ మించి పండిన పంటలను ఎవరు కొనుగోలు చేస్తారు? రైతులకు నష్టం జరిగితే దానికి ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు కార్పొరేటర్ మేకల సమ్మయ్య యాదవ్, నాయకులు మురళీధర్ రావు, మూల విజయారెడ్డి, రై తదితరులు పాల్గొన్నారు.



## స్త్రీ నిధి రికవరీ, రుణాల పంపిణీ 100 శాతం చేయాలి

- స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** స్త్రీ నిధి రికవరీని 100 శాతానికి పెంచడంతో పాటు రుణాల పంపిణీని శత శాతం పూర్తి చేసే దిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి అధ్యక్షతన నిర్వహించిన స్త్రీ నిధి జిల్లా సమీక్షా సమావేశం లో రికవరీ, రుణాల పంపిణీ, డిజిటల్ సేవల వినియోగం, సుస్థిర జీవనోపాధులు, ఆర్థిక క్రమశిక్షణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో స్త్రీ నిధి రుణ చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని రికవరీలు “మన స్త్రీ నిధి యాప్” ద్వారానే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లావాదేవీలలో పారదర్శకత, వేగవంతమైన అడ్జస్ట్‌మెంట్, సమగ్ర సమాచార నిర్వహణ కోసం అన్ని స్థాయిలలో యాప్ వినియోగాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే ఋణాల అంశంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని స్వయం సహాయక సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్ద పల్లి మండలాల్లో రికవరీ పనితీరు మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ మీ. కాళిందిని, ఘాణ=ఞా రవీందర్ , స్త్రీ నిధి ఆర్ ఎం ఆర్. దుర్గా ప్రసాద్ గారు, జిల్లా సమాఖ్య అధ్యకురాలు స్వప్న కార్యదర్శి శోభా, కోశాధికారి స్వప్న అందరూ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు వివిధ శాఖల అధికారులు, సెర్ప్, మెప్మా, స్త్రీ నిధి సిబ్బంది, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిష్ కేజీల నిర్వహణలో మహిళా సంఘాలు,

## రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలి

- ఎల్లంపల్లి జలాశయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే ఫిష్ కేజీల ఏర్పాటు
- ఫిష్ కేజీల నిర్వహణలో మహిళా సంఘాలు, రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలి
- ఆసక్తి ఉన్న రైతులతో ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేయాలి
- చేపల చెరువుల ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి కనీసం రూ.2 లక్షల అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలి
- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లోనే యువతకు శిక్షణ అందించాలి
- ఉద్యోగాలు పొందిన యువత విజయగాథలను విస్తృతంగా ప్రచారం చేయాలి
- చేపల చెరువులు, ఉపాధి అవకాశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** జిల్లాలో మత్స్య రంగం ద్వారా రైతులు, మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయం కల్పించే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అక్రమ చేపల చెరువులు, ఫిష్ కేజీల ఏర్పాటు, ఉపాధి అవకాశాలపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జలాశయ విస్తీర్ణంలో కేవలం ఒక శాతం భూభాగాన్ని మాత్రమే ఫిష్ కేజీల ఏర్పాటుకు వినియోగించవచ్చని తెలిపారు. ఎల్లంపల్లి జలాశయంలో మొత్తం 120 ఫిష్ కేజీలను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ఒక్కో కేజీ పొడవు 7.5 మీటర్లు, లోతు 4 మీటర్లుగా ఉంటుందని, 12 కేజీలతో ఒక బ్యాటరీ, మొత్తం 10 బ్యాటరీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కేజీల్లో బ్లాక్ కెలాఢియా చేపల పెంపకం చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో బ్యాటరీ ఏర్పాటుకు వాకింగ్ ట్రాక్‌తో కలిపి సుమారు రూ.28 లక్షల వ్యయం అవుతుందని తెలిపారు. 6 నుంచి 7 నెలల్లో చేపలు 600 నుంచి 700 గ్రాముల బరువుకు పెరుగుతాయని, ఒక్కో కేజీలో 2,500 చేప పిల్లలను వదిలితే 80 శాతం జీవన శాతంతో సుమారు 2 వేల చేపలు పెరుగుతాయని చెప్పారు. ఒక్కో కేజీ ద్వారా సుమారు రూ.30 వేల లాభం వచ్చే అవకాశం ఉందన్నారు. ఫిష్ కేజీల నిర్వహణలో మండల స్థాయి మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు సంఘాలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారుల్లో యాజమాన్య భావన పెంపొందేందుకు కనీసం 10 శాతం పెట్టుబడి వారివద్ద నుంచే ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆసక్తి కలిగిన రైతులను గుర్తించి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో చేపల చెరువుల ఏర్పాటు కోసం సుమారు రూ.35 లక్షల పెట్టుబడి అవసరమవుతుందని, నిర్వహణ వ్యయం రూ.54 లక్షలు ఉంటుందని తెలిపారు. ఒక్కో కల్చర్‌కు 7 నుంచి 8 నెలల్లో సుమారు రూ.17 లక్షల లాభం వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులకు ఈ వివరాలు తెలియజేసి ముందుకు వచ్చే వారికి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు సంవత్సరానికి కనీసం రూ.2 లక్షల అదనపు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సహకారం అంశాలపై సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టెలీ పెర్ఫార్మెన్స్, ఫాక్స్‌కాన్ సంస్థలు 500 మంది యువతకు ఉపాధి కల్పించేందుకు సిద్ధంగా ఉన్నందున, ఐడీఓసీలో నిర్వహించనున్న జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించి ఎక్కువ మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న కోర్సుల్లోనే యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ సహకారంతో ఉద్యోగాలు పొందిన యువత విజయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉపాధి కల్పన సేవల ద్వారా ఉద్యోగాలు పొందిన వారి విజయగాథలు ఎక్కువ మందికి చేరేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా మరింత మంది యువత ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి అవకాశాలపై యువతలో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సింగరేణి జనరల్ మేనేజర్, జిల్లా మత్స్యశాఖ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కీర్తికాంత్, జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, టాస్క్ ఇన్‌చార్జ్ కౌసల్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## కలెక్టర్ శ్రీహర్షకు అభినందన

**పెద్దపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** విద్య ప్రమాణాల పెంపులో పెద్దపల్లి జిల్లా అగ్రగామిగా నిలిచినందుకుగాను శుక్రవారం రోజున హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గౌరవ గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కలెక్టరేట్ లో ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు శాలువాతో సత్కరించారు.

## జూన్ 24న ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె.శ్రీధర్**

**పెద్దపల్లి, జూన్ 20**

జూన్ 24న పెద్దపల్లి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 2 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఎం.బి.బి.ఎస్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని,సివిల్ అసిస్టెంట్ సర్జన్ కి వేతనం రూపాయలు 52,351 ఉంటుందని ,ఇతర వివరాలకు 9492457809, 8499061999 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


విలేకరులు కావలెను

ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో రిపోర్టర్లు కావలెను

సెల్:8522024855

కొమురం భీమ్
Komurambheem Telugu Daily






## చర్ల రాజకీయాల్లో కాంగ్రెస్ హవా

- పెరుగుతున్న చేరికలు
- మాజీ సొసైటీ చేర్మెన్ కొప్పునుడి బాబురావు, సీతపతి రాజు, కాంగ్రెస్‌లో చేరిక

**చర్ల, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేరిన నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు నాయకత్వంలో చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. ఈ కార్యక్రమం లో లంక రాజు, మేడబత్తిన వాసు, ఇర్ప వసంత్, బ్రహ్మానంద రెడ్డి, మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ యోగా దినోత్సవాని ఘనంగా నిర్వహించాలి

- ఎంఈఓ ఉండేటి ఆనంద్ కుమార్

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):** ఆదివారం జూన్ 21 న మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్ కుమార్ ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో ఆరోగ్యం,ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు.12వ అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొనాలని కోరారు.అనంతరం యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు యోగాసనాల కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు యోగా డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకర మహదేవన్, సునంద రెడ్డి, శాంత కుమారి,రాజ్యలక్ష్మి, బాబు రావు, వెంకటేశ్వర రావు, బాలు, వసంత, సుశీల, పద్మ, మోతిలాల్, జయరాం, ప్రసాద్, శిరీష, ఖాసీం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన డి లక్ష్మీ రాజేశ్వరి

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):** భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల నూతన ఎంపీడీవో గా డి లక్ష్మీ రాజేశ్వరి శనివారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో అధికారికంగా



బాధ్యతలు స్వీకరించారు. గతంలో జిల్లా పరిషత్ డిప్యూటేషన్ పై పని చేసిన వి ఎస్ సత్యనారాయణ ములకలపల్లి మండలం ఎంపీడీవోగా బదిలీ కావడంతో,ఆయన స్థానంలో ఖమ్మం జిల్లా వైరా మండలంలో ఎంపీఓ గా విధులు నిర్వర్తించిన డి లక్ష్మీ రాజేశ్వరి పదోన్నతి బదిలీపై వచ్చి ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కొత్త గా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో, మండల సమగ్రాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేస్తానని తెలిపారు. మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని నూతన ఎంపీడీవోకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

## చర్ల మండలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శంకుస్థాపన

- దేవరపల్లి పంచాయతీలో రూ.1.73 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభం



**చర్ల, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** చర్ల మండల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం చర్ల మండలంలోని దేవరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1 కోటి 73 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామాల్లో రహదారుల నిర్మాణం పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సైతం సులభతరం అవుతుందని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన అనేక గ్రామాల్లో ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దేవరపల్లి పంచాయతీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని, పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళి, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు, లంక రాజు, మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## గిరిజన ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

- ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్



**చర్ల, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** చర్ల ప్రభుత్వాసుపత్రిలో వైద్యం కోసం వెళ్లిన గిరిజన ఉపాధ్యాయుడు పలక నాగేశ్వరావుపై అసభ్యకరంగా ప్రవర్తించి, భౌతిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనస్థీషియా వైద్యుడు డాక్టర్ కృష్ణ ప్రసాద్‌పై జిల్లా కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ, వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్ కృష్ణ ప్రసాద్ రోగులతో మర్యాదగా వ్యవహరించాల్సిన బాధ్యతను విస్మరించి, ఉపాధ్యాయుడు పలక నాగేశ్వరావును అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో సంబంధిత సెక్యూరిటీ సిబ్బంది కూడా పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన వైద్యులు ప్రేమాభిమానాలతో వ్యవహరించాలని, కానీ కొందరు వైద్యులు వృత్తి ధర్మాన్ని మరిచి రోగులను అవమానిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ను వెంటనే సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు ఊయికె బాలకృష్ణ, శ్యామల రామారావు, ఎన్ఎస్ఎన్ రవికుమార్, నీలం వెంకటరమణ, కుర్ల రాము, చిడం హిమగిరిబాబు, పూనెం వెంకటరమణ, తోటపల్లి రమేష్, కుర్ల మోహన్‌రావు, కాపుల కృష్ణార్జునరావు, సూరిబాబు, సోయం దేశవీర్రాజు, ఇరుప రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**చర్ల, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో స్థానిక గోదావరి కళా ప్రాంగణం, జీఎం కాలనీ గ్రౌండ్‌లో సామూహిక యోగా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న జరగనున్న నేపథ్యంలో ఒక రోజు ముందుగానే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ లలిత్ కుమార్ గారు, సేవా అధ్యక్షురాలు శ్రీమతి అనిత లలిత్ కుమార్ గారు, విశిష్ట అతితులుగా సుజయ్ ముజేందర్, క్వాలిటీ జనరల్ మేనేజర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను, అధికారుల సంఘం ప్రతినిధీ పై శ్రీనివాస్, గార్లు హాజరయి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు మొదట అందరి చేత యోగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జీఎం శ్రీ లలిత్ కుమార్ గారు మాట్లాడుతూ, యోగా కేవలం ఒక వ్యాయామ విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి రోజూ కనీసం ఒక గంట సమయాన్ని యోగాభ్యాసానికి కేటాయించి దానిని దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా ఒత్తిడి తగ్గి శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. అనంతరం సింగరేణి పాఠశాల, సరస్వతి శిశు మందిర్, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఆకట్టుకునే యోగా ప్రదర్శనలు నిర్వహించి ప్రేక్షకులను అలరించారు. అలాగే సేవా సభ్యులు ప్రత్యేక యోగా విన్యాసాలు ప్రదర్శించి యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. అలాగే ఆర్జీ-1 ఏరియాలోని జిడికే, 1ఓ3,2ఓ2ఇూ, 11 ఇంక్లైన్ ఓసి- 5 మరియు వివిధ డిపార్ట్మెంట్ మెంట్స్ లలో ఉద్యోగులచే సామూహిక యోగా కార్యక్రమములు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రామగుండం ఏరియా-1 పరిధిలోని అన్ని గనుల అధికారులు, ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు, యోగా శిక్షకులు, సేవా సభ్యులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక యోగా సాధన చేశారు. యోగా శిక్షకుల మార్గదర్శకత్వంలో వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించి యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. యోగా ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు, యోగా శిక్షకులు అతిథులు అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం శ్రీ చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర రమేష్ పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి డివై పియం వేణు, అధికారులు మోహన్ రావు , శ్రావణ్ కుమార్, హనుమంతరావు వీరారెడ్డి, వివిధ గనులు మరియు శాఖల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సేవా సభ్యులు తదితరులు భారి ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



క్లాసిఫైడ్ రూ. 50/- మాత్రమే

## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి

- ఎలాంటి ఒత్తిడికి గురికావదదన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి



ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

## అనారోగ్యంతో గర్భిణీ మృతి

**చంద్రుగొండ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** అనారోగ్యంతో గర్భిణీ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో వెలుగులోకి వచ్చింది. మృతురాలి బంధువులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం,



బెండాలపాడు గ్రామానికి చెందిన కారం భవాని(30) ఆరు నెలల గర్భిణీ గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో కొత్తగూడెం, ఖమ్మం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, ఇటీవల వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజిఎం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం సాయంత్రం(19న) మృతి చెందింది. శనివారం బెండాలపాడు మృతదేవాహన్ని తీసుకొచ్చి దహనం చేశారు. గర్భిణీగా ఉన్న కారం భవానికి సరియైనా వైద్య సలహాలు ఇవ్వక పోవడం వల్లనే అనారోగ్యంతో మృతి చెందిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గర్భిణిల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ,వైద్యులు పట్టించుకోకపోవడం వల్ల గ్రామాల్లో, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో గిరిజన మహిళలు మృత్యువాత పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాస్తవికకోణంలో విచారణ చేపడితే నిజాలు బయటకు వస్తాయని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మెడికల్ ఆఫీషర్ రాము వివరణః చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కారం భవాని గర్భిణిగా నమోదు అయింది. నాలుగో నెలలో పాల్వంచలోని అమ్మగారి ఇంటికి వెళ్లింది. అనారోగ్యంతో కొత్తగూడెం, ఖమ్మం ఆసుపత్రుల్లో వైద్యంచికిత్స అనంతరం, వరంగల్ ఎంజిఎంకి తరలించారు, అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇందులో ఎవరి నిర్లక్ష్యం లేదు.

## విద్యుత్ షాక్ తో మూడు పాడి గేదేలు మృతి

**చంద్రుగొండ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** మండల పరిధిలోని బెండాలపాడు గ్రామంలో విద్యుత్ షాక్ తో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన గాలి వానకి గ్రామ శివారులోని విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. శనివారం ఉ



దయం గోదా వెంకటేశ్వర్లుకు చెందిన మూడు సూడి గేదెలు మేతకు వెళ్లి, పడిపోయిన విద్యుత్ స్థంభాల తీగలను గమనించకుండా తగలడంతో మూడు సూడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గేదెలు చనిపోయిన విషయంపై రైతు గోదా వెంకటేశ్వర్లు తనను ఆదుకోవాలని, ఆర్థికంగా నష్టపోయానని వాపోయాడు. విద్యుత్ స్థంభాలు పడిపోయిన విద్యుత్ శాఖ అధికారులు కనీసం కరెంటు సరఫరా నిలిపివేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తిప్పనపల్లి ఎస్సీకాలనీ సమస్యలపై నిరసన

**చంద్రుగొండ, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :** తిప్పనపల్లి ఎస్సీకాలనీలో చెత్త సేకరణ చేయాలని, పనిచేయని చేతిపంపులకు మరమ్మత్తులు చేయాలని, డ్రైనేజి వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు శనివారం చెత్తకుప్పల వద్ద, పనిచేయని



చేతిపంపుల వద్ద నిలబడి తమ నిరసనని తెలియజేశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ. .. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతిరోజూ చెత్త సేకరణ జరగటం లేదని, అడిగితే డీజిల్ లేదని సమాధానం చెబుతున్నారన్నారు. మురుగునీరు గుంతల్లో ఉండి వాసన వస్తున్న కనీసం బ్లీచింగ్ చల్లటం లేదన్నారు. వీధిలైట్లు సైతం పెట్టడం లేదన్నారు. చేతిపంపులను కనీసం బాగు చేయించటం లేదన్నారు. ఎన్నిసార్లు పంచాయతీ సెక్రటరీకి, సర్పంచు తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామన్నారు. ఈ నిరసనలో ఎస్సీకాలనీ వాసులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- శ్రీరాముడి చిత్రంపై చెప్పు
- నిరసనగా ఢాకాలో హిందువుల భారీ ర్యాలీ

**ఢాకా, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం రాఇత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.

# యోధ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు

- ప్రశంసలు కురిపించిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్):**



లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య తీవ్ర విభేదాలు తలెత్తినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన్ను యోధ ప్రధానమంత్రిగా అభివర్ణించారు. వాషింగ్టన్ సమీపంలో ఖతార్ కానుకగా ఇచ్చిన నూతన ఎయిర్‌ఫోర్స్ వన్ విమాన ఆవిష్కరణ అనంతరం ట్రంప్ మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య చక్కటి పోరాటం జరిగిందన్నారు. 'నిస్సందేహంగా మేం ఇజ్రాయెల్‌తో చాలా బాగా పోరాడాం. ఆ దేశంతో మాకు గొప్ప సంబంధాలున్నాయి. మేము చాలా శక్తిమంతంగా ఉన్నాం. ఇక బీబీ(నెతన్యాహు).. ఓ యోధుడి లాంటి ప్రధానమంత్రి. ఆయన్ను అలాగే గుర్తించాలి. ఆ ఘనత ఆయనకు దక్కాల్సిందే' అని ట్రంప్ పేర్కొన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధాన్ని కొనసాగించాలని ఆ దేశ ప్రధాని తీవ్ర రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ట్రంప్ ఈ రకంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక.. లెబనాన్ ప్రాంతంలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను, ముఖ్యంగా లెబనాన్‌పై జరగబోయే దాడుల విషయమై ట్రంప్ ప్రస్తావిస్తూ.. అలాంటి నిర్ణయాలపై నియంత్రణ అవసరమన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు టెహ్రాన్‌తో ఒప్పందం కుదిరినప్పటికీ.. లెబనాన్‌లో ఇరాన్ మద్దతుగల హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న పోరాటం పట్ల ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సంభాషణలోనూ ఆయన నెతన్యాహునుద్దేశించి.. 'నీవు పిచ్చివాడివి. నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేనే నిన్ను కాపాడుతున్నాను' అని మాట తూలిన సంగతి తెలిసిందే. కాగా.. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందాన్ని నెతన్యాహు నిర్వీర్యం చేసే అవకాశముందని అమెరికా నిఘా సంస్థలు ట్రంప్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నట్టు ది వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం.. హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యలను కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో ఇజ్రాయెల్‌లో జాతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లెబనాన్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోబోనని, హెజ్‌బొల్లాతో పోరాటాన్ని తీవ్రతరం చేయాలనే తన సంకల్పాన్ని దేశ ప్రజలకు చూపించడంపైనే నెతన్యాహు రాజకీయ మనుగడ ఆధారపడి ఉందని స్థానిక మీడియా సంస్థలు ఉటంకించాయి.

## ప్రియుడి మోజులో

# రెండేళ్ల కొడుకు హత్య

- ఫిట్స్‌తో చనిపోయాడని భర్తను నమ్మించిన భార్య
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదుతో బయటపడ్డ బండారం

**సిద్దిపేట, జూన్ 20 (కొమురం భీమ్ న్యూస్) :**




సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. ప్రియుడితో ఏకాంతంగా గడిపేందుకు అడ్డొస్తున్నాడని రెండేళ్ల కొడుకునే ఓ కన్నతల్లి హత్యచేసింది. ఫిట్స్ వచ్చి చనిపోయాడని అందర్నీ నమ్మించింది. కానీ తండ్రికి అనుమానం రావడంతో 20 రోజుల తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన స్వామి క్యాబ్ డ్రైవర్. భార్య జ్యోతి, రెండేళ్ల కుమారుడు హరికృష్ణతో కలిసి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో జ్యోతి నవీన్ అనే వ్యక్తితో అక్రర సంబంధం పెట్టుకుంది. భర్త లేని సమయంలో ప్రియుడిని ఇంటికి పిలుచుకునేది. ఇలా వాళ్లిద్దరూ ఏకాంతంగా ఉన్న సమయంలో బాబు తరచూ ఏడుస్తుండటంతో నవీన్ చిరాకు పడ్డాడు. ఈ క్రమంలోనే నీ కొడుకు నాకు నచ్చలేదు.. వాడిని చంపేద్దామని జ్యోతితో చెప్పాడు. అందుకు జ్యోతి కూడా ఓకే చెప్పింది. దీంతో ఇద్దరూ కలిసి ఏడుస్తున్న బాబును.. క్రూరంగా నేలకేసి కొట్టి చంపారు. బాబు చనిపోయిన తర్వాత నాటకమాడిన జ్యోతి.. భర్త స్వామి ఇంటికి రాగానే అకస్మా?త్తుగా ఫిట్స్ వచ్చి బాబు చనిపోయాడని ఏడ్చింది. భార్య మాటలు నమ్మిన స్వామి.. నిజమేనని భావించి.. అదే రోజు రాత్రి మృతదేహాన్ని స్వగ్రామమైన తీగుల్ తీసుకెళ్లి ఖననం చేశాడు. కానీ కొద్దిరోజుల తర్వాత భార్య ప్రవర్తనలో తేడా రావడంతో స్వామికి అనుమానం మొదలైంది. పైగా ఇంట్లో రక్తపు మరకలు కనబడటంతో అది కాస్త బలపడింది. దీంతో తన కొడుకు మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారించగా.. జ్యోతి నేరం అంగీకరించింది. ఈ ఘటనలో జ్యోతిని పోలీసులు అరెస్టు చేయగా.. నవీన్ పరారీలో ఉన్నాడు.

## కొమురం భీమ్ క్రీడలు




# ప్రక్షాళన దిశగా ఢిల్లీ క్యాపిటల్స్

ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ చేరలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో భారీ ప్రక్షాళన మొదలైంది. ఐపీఎల్ 2027 కోసం భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించేందుకు డీసీ చర్చలు జరుపుతోంది. ప్రస్తుతం కోచింగ్ స్టాఫ్‌లో ఉన్న వేణుగోపాల్ రావు, హేమంగ్ బదానీ, మునాఫ్ పటేల్‌లను తప్పించనుంది. మరోవైపు, లక్నో సూపర్ జెయింట్స్ నుంచి రిషభ్ పంత్‌ను తిరిగి జట్టులోకి తెచ్చుకుని, అతడికి బదులుగా కుల్‌దీప్ యాదవ్‌ను ట్రేడ్ చేసేందుకు కూడా ఢిల్లీ పావులు కదుపుతోంది!ఐపీఎల్ 2026లో పేలవ ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో భారీ ప్రక్షాళన చేసేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా కోచింగ్ స్టాఫ్ విషయంలో ఆ ఫ్రాంఛైజీ కీలక నిర్ణయం తీసుకుంటోంది. గత సీజన్‌లో 14 పాయింట్లతో ఆరో ప్లేసులో నిలిచింది డీసీ. ఈ నేపథ్యంలో కోచింగ్ బృందంలో సమూల మార్పులు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా.. వేణుగోపాల్ రావు, హేమంగ్ బదానీ, మునాఫ్ పటేల్‌ను తప్పించనున్నట్లు తెలుస్తోంది. భారత మాజీ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్‌ను బ్యాటింగ్ కోచ్‌గా తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఐపీఎల్ 2027 కోసం ఫ్రాంఛైజీకి బ్యాటింగ్ కోచ్‌గా ఉండాలని డీసీ.. యువరాజ్‌ను సంప్రదించిందట. అందుకు యువీ కూడా సానుకూలంగానే స్పందించినట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే సీజన్‌లో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ కోచింగ్ స్టాఫ్‌లో కనిపించే అవకాశం ఉంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌లుగా ఎవరిని ఎంపిక చేయాలనే విషయంపై ఢిల్లీ క్యాపిటల్స్ ప్రస్తుతం ఫోకస్ పెట్టింది.కాగా టీమిండియా... టీ20 ప్రపంచకప్ 2007, వన్డే ప్రపంచకప్ 2011 గెలవడంలో యువీ కీలక పాత్ర పోషించాడు. ఈ రెండు టోర్నీల్లోనూ ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు. అంతేకాకుండా ప్రస్తుతం భారత వన్డే, టెస్ట్ జట్టు సారథి శుభ్‌మన్ గిల్.. ప్రపంచ నంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా ఉన్న అభిషేక్ శర్మకు సైతం మెంటార్‌గా ఉన్నాడు. పేలవ ఫామ్‌లో ఉన్నప్పుడు రిషభ్ పంత్ సైతం యువీ సలహాలు తీసుకున్నవాడే. ఇలా పలువురు క్రికెటర్ల ఆట మెరుగవ్వడంలో కీలకపాత్ర పోషించిన యువీ సేవలు వినియోగించుకోవాలని డీసీ భావిస్తోంది. అంతేకాకుండా సౌరవ్ గంగూలీకి సైతం కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఇక ఆటగాళ్ల విషయంలోనూ డీసీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రిషభ్ పంత్‌ను తిరిగి జట్టులోకి తీసుకోవాలని పావులు కదుపుతోంది. పంత్.. ఐపీఎల్ 2024 సీజన్ తర్వాత డీసీని వీడాడు. ఆపై జరిగిన వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ రూ. 27 కోట్లకు పంత్‌ను తీసుకుంది. కానీ గత రెండు సీజన్లలో అతడు సారథిగా, ఆటగాడిగా విఫలమయ్యాడు. దీంతో కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దీంతో జట్టును వీడాలని అతడు డిసైడ్ అయ్యాడట. మరోవైపు పంత్‌ను జట్టులోకి తీసుని.. అతడికి బదులుగా కుల్?దీప్ యాదవ్‌ను వదులుకునేందుకు డీసీ సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ఆఫ్ఘన్‌పై భారత్ భారీ విజయం..

- 9 వికెట్ల తేడాతో ఆఫ్ఘన్ చిత్తు
- 3-0తో భారత్ సిరీస్ క్లీన్ స్వీప్



చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో జరిగిన 3వ ాణ×లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అఫ్గానిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నా, ప్రసీథ్ కృష్ణ అద్భుత బౌలింగ్‌తో వారిని 218 పరుగులకు ఆలౌట్ చేసింది. భారత్ లక్ష్యాన్ని 28.4 ఓవర్లలోనే 224/1తో చేజ్ చేసి 9 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3-0తో ముగించింది. ఇది అఫ్గానిస్తాన్‌పై భారత్ బలమైన ప్రదర్శనను మరోసారి నిరూపించింది. మ్యాచ్ ప్రారంభంలో అఫ్గానిస్తాన్ బ్యాటింగ్ దుర్వినియోగమైంది. ప్రసీథ్ కృష్ణ మొదటి ఓవర్‌లోనే రహ్మానుల్లా గుర్బాజ్‌ను (5) ఔట్ చేశాడు. రోహిత్ శర్మ స్లిప్‌లో అద్భుత క్యాచులు పట్టి మూడు వికెట్లు సహకరించాడు. ఇబ్రాహిం జాద్రాన్ (11), రహ్మత్ షా (5), దర్విష్ రసూలి త్వరగా పెవిలియన్ చేరారు. అఫ్గానిస్తాన్ 9.2 ఓవర్లలో 36/4కి కుప్పకూలింది. ఈ సమయంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిది మరియు అజ్మతుల్లా ఒమర్జాయ్ భాగస్వామ్యం కీలకమైంది. ఒమర్జాయ్ అర్ధ శతకం (50) సాధించగా, షాహిది తన మైడెన్ వన్డే సెంచరీ (102 బాల్స్‌లో 102 పరుగులు, 13 ఫోర్లు, 1 సిక్స్)తో జట్టును 218 వరకు తీసుకెళ్లాడు. ప్రసీథ్ కృష్ణ 8.2 ఓవర్లలో 23 పరుగులకు 5 వికెట్లు సాధించి మ్యాచ్‌ను తన వశం చేసుకున్నాడు. ఇతర బౌలర్లు కూడా సహకరించారు. ఛేజింగ్‌లో భారత్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతంగా ఆడారు. రోహిత్ 79 పరుగులు చేసి ఔట్ అయ్యాడు కానీ జైస్వాల్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. భారత్ 28.4 ఓవర్లలో 224/1తో లక్ష్యం చేరుకుంది. ఈ విజయంతో భారత్ ాణ× సిరీస్‌ను 3-0తో గెలిచి ఆధిపత్యం చాటింది. షుబ్‌మన్ గిల్ నాయకత్వంలో జట్టు డెప్త్‌ను ప్రదర్శించింది. నితీష్ కుమార్ రెడ్డీ, హర్ష్ దుబే, ప్రసీథ్ కృష్ణ వంటి ఆటగాళ్లు అవకాశాలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సిరీస్ భారత్ క్రికెట్ బలాన్ని మరోసారి హైలైట్ చేసింది. అఫ్గానిస్తాన్ షాహిది సెంచరీతో పోరాడినా, బౌలింగ్ బలహీనతలు వారిని ఓడించాయి. చెన్నై పిచ్ స్పిన్, పేస్‌కు సపోర్టు ఇచ్చింది. భారత్ బౌలర్లు డెత్ ఓవర్లలో కూడా నియంత్రణ కాపాడారు. ఈ మ్యాచ్ యువ ఆటగాళ్ల అవకాశాలు, జట్టు డెప్త్‌ను చూపించింది. క్రికెట్ ప్రేమికులు ఈ విజయాన్ని సంబరాలతో జరుపుకుంటున్నారు. భారత్ ఈ సిరీస్ గెలుపుతో 2027 ప్రపంచ కప్ సన్నాహాలను మరింత బలోపేతం చేసుకుంది. అఫ్గానిస్తాన్ తమ అనుభవాన్ని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ ఓపెనింగ్ భాగస్వామ్యం, ప్రసీథ్ బౌలింగ్ మరపురాని ముద్ర వేశాయి. ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరితమైనదిగా మారింది. ఈ విజయం భారత్ క్రికెట్ భవిష్యత్తును ఉజ్వలంగా చూపిస్తుంది. యువ ఆటగాళ్ల అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గ్రేట్. అఫ్గానిస్తాన్ జట్టు కూడా తమ సామర్థ్యాలను మెరుగుపరచుకుని భవిష్యత్ మ్యాచ్‌లలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని కోరుకుందాం. మొత్తం సిరీస్ భారత్ ఆధిపత్యంతో ముగిసింది.

# వన్డే క్రికెట్ చరిత్రలోనే టీమిండియా సరికొత్త రికార్డు



చెన్నై వేదికగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో భారత్ వన్డే క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. అఫ్ఘాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ పిచ్‌పై పదే పదే పరుగెత్తడంతో అంపైర్లు 5 పరుగుల పెనాల్టీ విధించారు. దీంతో 5/0తో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, తొలి ఓవర్లోనే యశస్వి జైశ్వాల్ బౌండరీల వర్షం కురిపించడంతో ఏకంగా 23 పరుగులు రాబట్టింది. ఫలితంగా 2004లో బంగ్లాదేశ్‌పై నమోదైన 22 పరుగుల రికార్డును టీమిండియా బద్దలు కొట్టింది. శనివారం చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో, భారత్ ఓ అరుదైన రికార్డు సాధించింది. 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. తొలి ఓవర్‌లోనే ఎదురుదాడికి దిగింది. ఏకంగా రికార్డు స్థాయిలో తొలి ఆరు బంతుల్లో 23 రన్స్ రాబట్టింది. దీంతో వన్డే క్రికెట్ చరిత్రలో తమ అత్యధిక తొలి ఓవర్ స్కోరు నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ 219 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్ భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అయితే అఫ్ఘాన్ బ్యాటింగ్ చేస్తుండగా.. ఆ జట్టు కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ పదే పదే పిచ్‌లోని సురక్షిత ప్రాంతంలోకి పరుగెత్తాడు. దీంతో అంపైర్లు.. ఆ జట్టుకు 5 రన్స్ పెనాల్టీగా విధించారు. దీంతో టీమిండియా 5/0 స్కోరుతో తమ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఇక భారత బ్యాటర్లు మరో 18 రన్స్ చేయడంతో 22 ఏళ్ల తర్వాత వన్డే క్రికెట్‌లో ఓ ఓవర్‌లో తమ అత్యధిక స్కోరును టీమిండియా నమోదు చేసింది.భారత్ ఛేజింగ్‌కు దిగినప్పుడు పాకిస్థాన్ పేసర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ బౌలింగ్‌కు వచ్చాడు. అతడే తొలి ఓవర్ వేశాడు. భారత్ 5/0తో ఇన్నింగ్స్ ప్రారంభించగా, జైశ్వాల్ స్ట్రైకింగ్‌లో ఉన్నాడు. తొలి బంతి డాట్ అయింది. రెండో బంతి వైడ్ కాగా.. మూడో బంతికి రెండు రన్స్ వచ్చాయి. ఆ తర్వాత ఫోర్ కొట్టాడు జైశ్వాల్. ఆపై నోబాల్, వైడ్, నోబాల్ ఫోర్ వచ్చాయి. చివరి మూడు బంతుల్లో 0, 4, 0 రన్స్ వచ్చాయి. ఫలితంగా ఈ ఓవర్‌లో 23 రన్స్ వచ్చినట్లుయింది. ఫలితంగా భారత్.. అరుదైన రికార్డును నమోదు చేసింది.

# చెపాక్‌లో శతక్కొట్టిన జైశ్వాల్..

చెన్నై వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో అఫ్ఘానిస్థాన్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్, మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత ప్రసిద్ధ్ కృష్ణ ధాటికి అఫ్ఘాన్ 218 పరుగులకే ఆలౌట్ కాగా, కెప్టెన్ షాహిదీ (102) సెంచరీతో రాణించాడు. అనంతరం 219 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (110 నాటౌట్) అద్భుత సెంచరీ సాధించగా, రోహిత్ శర్మ 79 పరుగులతో రాణించాడు.న్నై వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘాన్ కెప్టెన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ వేయడం.. అఫ్ఘాన్ బ్యాటర్లు షాట్లు కొట్టడం.. బంతి వెళ్లి నేరుగా రోహిత్ శర్మ చేతిలో పడటం. వరుసగా మూడు వికెట్లు ఇదే తరహాలో పడ్డాయి. రెహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, రెహ్మత్ షా.. ముగ్గురు ప్రసిద్ధ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యారు. డార్విష్ రసూల్ కూడా ఔట్ కావడంతో అఫ్ఘాన్.. 36/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ (102), అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) ఆదుకున్నారు. కానీ వారిద్దరూ ఔట్ అయ్యాక అఫ్ఘాన్ కుప్పకూలింది.

కొమురం భీమ్
Komurambheem Telugu Daily

# కొమురం భీమ్ సినిమా




## ఓటీటీలోకి అర్జున్ బ్లాస్ మూవీ

చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.

## ఫ్రెండ్స్ దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూత

హాలీవుడ్‌లో విషాదం నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ పొందిన 'ఫ్రెండ్స్', 'చీర్స్' వంటి ఐకానిక్ అమెరికన్ సిట్‌కామ్‌ల దర్శకుడు జేమ్స్ బరోస్ కన్నుమూశారు. 85 ఏళ్ల బరోస్ శుక్రవారం రాత్రి నిద్రలోనే ప్రశాంతంగా తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఈ విషాద వార్త తెలియగానే హాలీవుడ్ పరిశ్రమతో పాటు 'ఫ్రెండ్స్' వెబ్ సిరీస్ నటీనటులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ తమ ప్రియమైన దర్శకుడికి నివాళు లర్పించారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన కెరీర్‌లో జేమ్స్ బరోస్ దాదాపు 1000కి పైగా టెలివిజన్ ఎపిసోడ్‌లకు దర్శకత్వం వహించి రికార్డు సృష్టించారు. 'ఫ్రెండ్స్'తో పాటు చీర్స్, ఫ్రేజియర్, విల్ అండ్ గ్రేస్, ది బిగ్ బ్యాంగ్ థియరీ, టూ అండ్ ఏ హాఫ్ మెన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత కామెడీ షోలను ఆయన రూపొందించారు. తన అద్భుతమైన దర్శకత్వ ప్రతిభకు గానూ ఆయన ఏకంగా 11 ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డులను గెలుచుకున్నారు. జేమ్స్ బరోస్ మరణంపై 'ఫ్రెండ్స్' సిరీస్ నటులు డేవిడ్ శ్విమ్మర్, మాట్ లెబ్లాంక్, లిసా కుడ్రో సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'జిమ్మీ బరోస్ తాను పనిచేసిన ప్రతి నటుడిలోని ఉత్తమ ప్రతిభను బయటకు తీసేవారు. ఆయన కామెడీని మరింత నవ్వించేలా, ఎమోషన్‌ను మరింత హృదయానికి హత్తుకునేలా మార్చేవారు. ఆయన చూపించిన ఆప్యాయత మాకు ఒక కుటుంబంలాంటి సురక్షితమైన అనుభూతిని ఇచ్చింది' అని డేవిడ్ శ్విమ్మర్ భావోద్వేగంగా రాశారు.

### మా ఇంటి బంగారం

# ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్

సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2ఆ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖ ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు




నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.

# సోషియో ఫాంటసీగా నాగబంధం

### ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం


యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకె స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది. విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని,




ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అభిమానితో కలసి పుష్ప రీక్రియేట్ చేసిన అల్లు అర్జున్

లుకేమియాతో బాధపడుతున్న చిన్నారి శ్రద్ధ కోరికను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీర్చారు. మేక్-ఎ-విష్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఆమెను కలిసిన అల్లు అర్జున్, 'పుష్ప' సినిమాలోని పాపులర్ మూమెంట్స్‌ను ఆమెతో కలిసి రీక్రియేట్ చేశారు. ఈ హృదయాన్ని హత్తుకునే వీడియోను అల్లు అర్జున్ టీమ్ షేర్ చేయగా, సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. వీడియోలో అల్లు అర్జున్ నవ్వుతూ హాయ్ శ్రద్ధా, ఎలా ఉన్నావ్? అని పలకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమాలోని ఐకానిక్ డైలాగ్ చెప్పమని ప్రోత్సహించారు. ఇద్దరూ కలిసి పుష్ప సిగ్నేచర్ బియర్డ్ స్ట్రోక్ చేయగా, అల్లు అర్జున్ చప్పట్లు కొడుతూ 'డ్యామ్ క్యూట్' అని మెచ్చుకున్నారు. చివరగా నువ్వు కోలుకున్న తర్వాత హైదరాబాద్‌కు రా అని చెప్పారు. ఏమవ్వాలనుకుంటున్నావ్ అని అడగగా, శ్రద్ధ డాక్టర్ అవ్వాలని ఉందని బదులిచ్చింది.








## కాక్‌టెయిల్2 కుటుంబ కథా చిత్రం

షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' . ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ.13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

# ప్రేక్షకులను అలరించేలా చిత్రాలు ఉండాల్సిందే

### డబుల్ ఆక్యుపెన్సీ చిత్ర సక్సెస్ మీట్‌లో ఖుష్బూ

మనం నిర్మించే చిత్రాలు ప్రేక్షకులను అలరించేలా ఉండాలని ప్రముఖ నటి ఖుష్బూ పేర్కొన్నారు. అవ్నీ మూవీస్ పతాకంపై రూపొందిన 'డబుల్ ఆక్యుపెన్సీ'చిత్రం గతవారం విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సక్సెస్‌ను పురస్కరించుకుని తాజాగా చిత్రబృందం చెన్నై నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ఖుష్బూ మాట్లాడుతూ.. 'చిన్న చిత్రం ఇంతటి సక్సెస్ సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. మనం నిర్మించే సినిమా ప్రేక్షకులను అలరించాలి. వారు చెల్లించే డబ్బుకు తగిన విలువ ఉండాలి అని నా భర్త సుందర్ అంటుంటారు. ఈ చిత్రంతో ఆయన మాటలను మేము కూడా నిజం చేశాం. గత కొన్ని రోజులుగా నేను ఎంతో బిజీగా ఉన్నాను. నా పెద్ద కుమార్తె పెళ్ళి పనుల్లో బిజీగా ఉంది. నా భర్త సుందర్ 'పురుషన్' షూటింగ్, పెళ్ళి పనుల్లో క్షణం తీరికలేకుండా ఉన్నారు. నా చిన్న కుమార్తె ఈ చిత్ర నిర్మాణ పనులు చూసుకుంది. ఈ సినిమా నిర్మాణంలో పలు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, వాటిని ఆమె విజయవంతంగా అధిగమించింది. నా పెద్ద కుమార్తె రెండు చిత్రాల్లో నటిస్తోంది. మరో నాలుగు చిత్రాలకు కమిట్ అయింది. గతంలో ఒక హీరోయిన్.. ప్రేమ, పెళ్ళి వంటి అంశాలపై మాట్లాడేందుకు భయపడేది. ఇప్పుడు కాలంతో పాటు అంతా మారిపోయిందని పేర్కొన్నారు.






Printer, Published and Owned by YASHASHWIN PUBLICATIONS, H.No. 21-1-29/A/J/1, GODAVARIKHANI, Dist. Peddapalli, TELANGANA STATE - 505 209.
Printers : Yashashwin Printers, Godavarikhani. Editor : MULKALA PRASAD, RNI No. : TELTEL/2019/79009, e-mail : komurambheemnews@gmail.com, Mobile : 8522024855